www.nagaranijam.com

PRGI/RNI NO: APTEL/2013/54450

నగరనిజం

www.nagaranijam.com

అక్షరనిజం నగరనిజం

తెలుగు దిన పత్రిక

NN TV TELANGANA నగర నిజం

సంపుటి : 13	సంచిక :353	ఉమ్మడి రంగారెడ్డి	సంపాదకులు : ఏలె. పురుషోత్తం	12 గురువారం, మార్చి 2026	పేజీలు : 4+	₹ 3

Volume : 13	Issue : 353	Rangareddy	Editor : Yela.Purushotham	12 Thursday, MARCH 2026	Pages : 4 +	Price : 3/-

Published From Rangareddy,Circulated by Hyderabad, Nalgonda, Khammam, Karimnagar, Warangal, Mahaboobnagar, Medak, Nizamabad, Adilabad

ప్రేమ నేర్పుతుంది

కూకట్పల్లి మార్చి11,(నగర నిజం ప్రతినిధి) : ప్రేమ మనసుకు భావాలను నేర్పుతుంది.
విద్య జీవితానికి దిశను చూపిస్తుంది.
జర్నలిజం విద్యార్థికి నేర్పేది ఏమిటంటే...
నిజాన్ని వెతికే కలం ఎంత ముఖ్యమో
జీవితాన్ని అందంగా మలిచే
ప్రేమ కూడా అంతే ముఖ్యం
ప్రేమ హృదయాన్ని పెంచుతుంది.
విద్య భవిష్యత్తును నిర్మిస్తుంది.
ఏమ్మడి సుధీర్ కుమార్ (హైకోర్ట్ అడ్వకేట్)
మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం
సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీ,
హైదరాబాద్.

తెలంగాణ గవర్నర్‌గా శివ్ ప్రతాప్ శుక్లా ప్రమాణ స్వీకారం

హైదరాబాద్, నగరనిజం:తెలంగా ణ రాజకీయ చరిత్రలో ఒక కొత్త అ ధ్యాయం ప్రారంభమైంది. రాష్ట్ర ప్ర జల ఆశల మధ్య, గౌరవ ప్రదమైన వేడుకలో తెలంగాణ నూతన గవర్నర్‌గా శివ్ ప్రతా ప్ శుక్లా బుధవారం పదవీ స్వీకార ప్రమాణం చేశారు. లోక్ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమం అత్యంత గౌరవంగా, భవి ష్యత్తుపై ఆశలు నింపే విధంగా జరగగా రాష్ట్ర హైకోర్టు ప్రధా న న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ శివ ప్రతాప్ శుక్లాతో గవర్నర్‌గా ప్రమాణం చేయించారు. ఈ వేడుకకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి హాజరై కొ త్త గవర్నర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన తో పాటు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శా సనసభ స్పీకర్ గడ్డం ప్ర సా ద్ కుమార్, ఉప ముఖ్య మంత్రి భ ట్టి విక్రమార్క మల్లు, మంత్రులు దుద్దిల్ల శ్రీధర్ బాబు, కో మటిరెడ్డి వెంకట రెడ్డి, మహమ్మద్ అజారు ద్దీన్, సీత క్క, దా మోదర్ రాజన ర్సింహ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్, ప్ర జా ప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొని ఈ చారిత్రాత్మక వేడుకకు సాక్షులయ్యా రు.అంతకు ముందు తెలంగాణ కు నూతన గవర్నర్‌గా నియ మితులైన శివ ప్రతాప్ శుక్లా హైదరాబాద్‌కు చేరుకున్న సమ యంలో రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద ఆయనకు ఘన స్వాగతం లభించింది. ముఖ్య మంత్రి రేవం త్ రెడ్డి స్వయంగా వెళ్లి గవర్నర్‌ను ఆహ్వానించారు.ఈ స్వాగత కార్యక్రమంలో మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, ప్ర భుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు, డీజీపీ బి శివ ధర్ రెడ్డి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేసిన యువజన కాంగ్రెస్ నాయకుడు

- అయిటిపాముల రామ్‌రాజు
- వలిగొండ మోడల్ స్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు సహాయం

భవిష్యత్తులో ఉన్నత స్థానాలు సాధించాలని ఆకాంక్ష

వలిగొండ మార్చి11(నగర నిజం) యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ పట్టణంలోని మోడల్ స్కూల్‌లో ఈరోజు వలిగొండ పట్టణ యువజన కాంగ్రెస్ నాయకులు అయిటిపాముల రామ్‌రాజు పదో తరగతి విద్యార్థులకు పరీక్షల కోసం అవసరమైన పరీక్ష ప్యాడ్లను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈఓ భాస్కర్ మరియు వలిగొండ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మైసోళ్ళ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయిటిపాముల రామ్‌రాజు మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఉన్నత లక్ష్యాలను పెట్టుకొని కష్టపడి చదవాలని సూచించారు. పదో తరగతి పరీక్షలు ప్రతి విద్యార్థి జీవితంలో కీలకమైన దశ అని, మంచి ఫలితాలు సాధించి తల్లిదండ్రులు, గురువులకు పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. తమ వంతుగా విద్యార్థులకు అవసరమైన సహాయం ఎప్పటికీ కొనసాగుతుందని తెలిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈఓ భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివితే మంచి భవిష్యత్తు నిర్మించుకోవచ్చని అన్నారు. విద్యతోనే సమాజం అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో 5వ వార్డ్ మెంబర్ సుంకి మహేందర్, పద్మశాలి సంఘం అధ్యక్షులు గంజి వెంకటేష్, జగన్, గణేష్, శివశం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

పొలాల్లో 'పచ్చని' మురిపెం: అన్నదాత స్వేదంతో పండుతున్న 'సిరి'

"పెరిగిన పెట్టుబడి వ్యయం, కరెంటు కష్టాలు, అకాల వర్షాల భయం.. వీటన్నింటినీ తట్టుకుని నిలబడుతున్న అన్నదాత."

- రైతు కష్టం.. పచ్చని ఇష్టం। అడుగడుగునా సవాళ్లున్నా.. వెనకడుగు వేయని సాగు। ఊపిరి పోస్తున్న వరి పైరు

మేడ్చల్, మార్చి 11 (నగరనిజం ప్రతినిధి): ఒక్కసారి మహానగరాన్ని దాటి ఎల్లంపేట్ మున్సిపల్ వైపు అడుగు వేస్తే.. కళ్లు చెదిరే పచ్చదనం స్వాగతం పలుకుతోంది. భూతల్లి పచ్చని పట్టుచీర కట్టుకుందా అన్నట్లుగా వరి పొలాలు అలరారుతున్నాయి. అయితే, ఈ పచ్చని దృశ్యం వెనుక కేవలం నీరు, ఎరువులు మాత్రమే లేవు.. అన్నదాత చిందించిన రక్తం, రాత్రింబవళ్లు పడ్డ కష్టం దాగి ఉంది. నాటినప్పటి నుంచి కోత కోసే వరకు రైతు పడే ప్రతి వేదన ఈ పచ్చని పైరులో ప్రతిబింబిస్తోంది.ఎటు చూసినా కనుచూపు మేరలో పరుచుకున్న వరి పైరు చూస్తుంటే.. భూతల్లి పచ్చని పట్టుచీర కట్టుకుందా అన్నట్లుగా ఉంది.ఈ ఆహ్లాదకరమైన దృశ్యం వెనుక అన్నదాత నెలల తరబడి చిందించిన రక్తాన్ని చెమటగా మార్చిన కఠోర శ్రమ దాగి ఉంది.మట్టి నుంచి మొలక వరకు..వరి సాగు అనేది ఒక యజ్ఞం. వేసవి కాలంలోనే భూమిని సిద్ధం చేయడం (దుక్కి దున్నడం) దగ్గరి నుండి రైతు ప్రయాణం మొదలవుతుంది. మండుటెండను లెక్కచేయక పొలాన్ని చదును చేసి, నారుమడి పోసి, ఆ మొక్కలు పదునొచ్చాక బురదలో దిగి నాట్లు వేయడం వరకు ప్రతి అడుగూ ఒక సవాలే. కూలీల కొరత, పెరిగిన ఎరువుల ధరలు భారమైనా.. "లోకానికి అన్నం పెట్టేవాడిని" అనే తృప్తితో రైతు ముందుకు సాగుతున్నాడు.

ప్రతి మెతుకు వెనక రైతు వెన్నుముక విరిగే శ్రమ..

మనం భోజనం చేసే ప్రతి మెతుకు వెనుక ఒక రైతు వెన్నుముక విరిగే శ్రమ ఉంది. మేడ్చల్ ప్రాంతంలోని ఈ పచ్చని పొలాలు కేవలం ఆహారాన్ని ఇచ్చే వనరులు మాత్రమే కాదు.. అవి కుమార్, అంజిరెడ్డి, నందు వంటి వేలాది మంది రైతుల జీవనధారలు. ఈ పచ్చని సిరి ఎలాంటి ఆటంకాలు లేకుండా అన్నదాత ఇళ్లకు చేరి, వారి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆశిద్దాం.

"మేడ్చల్ శివార్లలో కనువిందు చేస్తున్న పచ్చని వరి పైరు.. రైతు శ్రమకు అద్దం పడుతున్న దృశ్యం."

పెట్టుబడి భారం.. శ్రమ మాత్రం అపారం..

వరి సాగు అనేది ఒక యజ్ఞంలా సాగుతోంది. విత్తనం నాటిన దగ్గరి నుంచి పంట చేతికి వచ్చే వరకు ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాల్సిందేనని రైతులు వాపోతున్నారు. కొనయిపల్లి గ్రామానికి చెందిన రైతు గుంటి కుమార్ తన అనుభవాన్ని పంచుకుంటూ.. "పొలం దున్నడం దగ్గరి నుంచి నాట్లు వేయడం వరకు కూలీల ఖర్చు తడిసి మోపెడవుతోంది. విత్తనాలు, ఎరువుల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. పెట్టుబడి పెరగడంతో పాటు సరైన సమయంలో వర్షాలు కురవకపోతే రైతు పరిస్థితి అగమ్యగోచరంగా మారుతుంది. పచ్చని పైరును చూసి మురిసిపోవడం వెనుక ఎన్నో నిద్రలేని రాత్రులు ఉన్నాయి" అని తెలిపారు.

రైతు గుంటి కుమార్

అపరాత్రి వేళ.. కరెంటు వెలుగుల్లో పోరాటం..

పొలాల్లో మోటార్లు, విద్యుత్ తీగలే రైతుకు నేస్తాలు. కరెంటు సరఫరాపై ఆధారపడి సాగు చేసే రైతులకు రాత్రిపూట నీరు పెట్టడం ఒక పెద్ద సవాలుగా మారింది. లింగాపూర్ గ్రామానికి చెందిన రైతు సద్ది అంజిరెడ్డి మాట్లాడుతూ.. "పంటకు నీరు ప్రాణాధారం. కరెంటు ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితుల్లో, అర్ధరాత్రి వేళ కూడా నిద్రను త్యాగం చేసి పొలాలకు వెళ్లాల్సి వస్తోంది. పాముల భయం, వన్యప్రాణుల బెడద ఉన్నా.. ప్రాణాలకు తెగించి పైరును కాపాడుకుంటున్నాం. కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర దక్కితేనే మా శ్రమకు సార్థకత" అని పేర్కొన్నారు.

రైతు అంజిరెడ్డి

పొట్ట దశలో పైరు.. గుబులు పుట్టిస్తున్న చీడపీడలు..

ప్రస్తుతం మేడ్చల్ ప్రాంతంలో వరి పంట పొట్ట దశకు చేరుకుంది. ఈ సమయంలో చీడపీడలు ఆశించకుండా జాగ్రత్తలు తీసుకోవడం రైతులకు కత్తి మీద సాములా మారింది. నూతనకల్ గ్రామానికి చెందిన రైతు తలారి నందు తన ఆవేదన వ్యక్తం చేస్తూ.. "పైరు ఎదుగుతున్న కొద్దీ సంతోషం కలుగుతుంది కానీ, మరోవైపు అకాల వర్షాలు, గాలులు ఎక్కడ దెబ్బతీస్తాయోనని భయంగా ఉంది. అహర్నిశలు శ్రమించి పండించిన పంటను కళ్లచూడక ముందే ప్రకృతి వైపరీత్యాలు కబళిస్తాయేమోనని గుబులుగా ఉంటుంది. ప్రభుత్వం రైతులకు అండగా ఉండి, మద్దతు ధర కల్పించాలి" అని కోరారు.

రైతు తలారి నందు

కూలీల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

- ఆన్లైన్ అటెండేన్స్ రద్దు చేయాలి
- ఈ నెల 23న ఛలో జిల్లా కలెక్టరేట్
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.సామెల్
- ముకునూర్‌లో ఉపాధి కూలీలతో సమావేశం

ఇబ్రహీంపట్నం, మార్చి 11 (నగరనిజం): పెండింగులో ఉన్న ఉపాధి కూలీల బిల్లులను వెంటనే విడుదల చేయాలని కూలీలకు పని ప్రదేశంలో మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.సామేల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఇబ్రహీంపట్నం మండలం పరిధిలోని ముకునూరు గ్రామంలో ఉపాధి హామీ ప్రదేశాన్ని సందర్శించి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సామేల్ మాట్లాడుతూ... కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ పనిని ఎత్తివేయాలని చూస్తుందన్నారు. అందులో భాగంగానే ఈ పథకానికి విబిజి రాంజీగా పేరు మార్చింది అన్నారు. ఈ పథకానికి సరిపడా నిధులు కేటాయించకుండా, కేటాయించిన నిధులను కూడా ఖర్చు చేయడం లేదన్నారు. ఆన్లైన్ అటెండెన్స్ వల్ల కూలీలు తీవ్రంగా నష్టపోతున్నారని, ఫోటోలు రాకపోవడంతో పనిచేసిన గాని హాజరు పడటం లేదన్నారు. వెంటనే ఆన్లైన్ ఫోటో అటెండెన్స్ ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో కూలీలకు మౌలిక వసతులు కల్పించాలన్నారు. పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని ఈనెల 23న రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ముందు మహాధర్నా కార్యక్రమం ఉంటుందని దీనికి కూలీలందరూ పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు పి జగన్, మండల కమిటీ సభ్యులు మేడిబాయి ఆనంద్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి గడ్డం గణేష్, ప్రభు, తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ అండ్ హెల్త్ కాలనీలో బీటీ రోడ్ పనుల పరిశీలన చేసిన మొద్దు లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్, మార్చి 11 (నగర నిజం): బి.ఎన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని మెడికల్ అండ్ హెల్త్ కాలనీలో జరుగుతున్న బీటీ రోడ్ నిర్మాణ పనులను జిహెచ్ఎంసీ తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పరిశీలించారు. పనుల పురోగతిని పరిశీలిస్తూ నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులు నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మొద్దు లచ్చి రెడ్డి మాట్లాడుతూ కాలనీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. కాలనీల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకొస్తే సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు మూర్తి, రామారావు, నాగయ్యతో పాటు ఇంజనీరింగ్ విభాగానికి చెందిన వర్క్ ఇన్‌స్పెక్టర్ సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు, డ్రైనేజీ సమస్యల పరిష్కారం కోరుతూ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిని కలిసిన కాలనీవాసులు

ఎల్‌బీనగర్, మార్చి 11 (నగర నిజం): చైతన్యపురి డివిజన్ పరిధిలోని ఎంసిఎచ్ కాలనీ మరియు సాయి నగర్ కాలనీలలో నెలకొన్న రోడ్లు, డ్రైనేజీ సమస్యలపై కాలనీవాసులు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ కాలనీల్లో ఉన్న సమస్యలను త్వరలోనే పరిశీలించి ఒక్కొక్కటిగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు అందించడమే తన ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో చైతన్యపురి డివిజన్ బీఆర్ఎస్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, ఎంసిఎచ్ కాలనీ అధ్యక్షుడు శ్రీహరి, సాయి నగర్ కాలనీ అధ్యక్షుడు లక్ష్మణ చారి, లక్ష్మి, పరందాములు, వేణు తదితరులు పాల్గొన్నారు.

ఘన్ పూర్ మెడిసిటీ ఇన్సిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

మేడ్చల్ మార్చి 11(నగరనిజం)ఏటా మార్చి 8 నాడు ప్రపంచ వ్యాప్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఎల్లంపేట్ మున్సిపల్ పరిధిలో ని ఘనపూర్ లో గల మెడిసిటి ఇన్సిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, వారు ప్రత్యేక కార్యక్రమాన్ని బుధవారం నాడు సంస్థ ఆవరణలోని ఆడిటోరియంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డా. జయంతి రెడ్డి, సీనియర్ గైనకాలజిస్టు మరియు ది ఆబ్స్టెట్రిక్స్ & గైనకాలజికల్ సొసైటీ ఆఫ్ హైదరాబాద్ (OGSH), అధ్యక్షురాలు పాల్గొనగా డా. పియస్ రెడ్డి, వ్యవస్థాపకులు, షేర్ ఇండియా ఫౌండేషన్ వారు అధ్యక్షత వహించారు. సాంప్రదాయ జ్యోతి ప్రజ్వళనతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ముందుగా హాజరైన ముఖ్య అతిథుల కు డా. కల్పన, ప్రొఫెసర్ మరియు హెడ్, ఆబ్స్టెట్రిక్స్ & గైనకాలజి విభాగం, మెడిసిటి ఇన్సిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ వారు స్వాగతం పలికారు.ందుగా కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డా. పియస్ రెడ్డి, వ్యవస్థాపకులు, షేర్ ఇండియా ఫౌండేషన్ వారు మాట్లాడుతూ మహిళల సామాజిక, ఆర్థిక, రాజకీయ విజయాలను గుర్తించి, లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడానికి జరుపుకునే ఒక ముఖ్యమైన దినోత్సవమని వివరించారు. ఇది మహిళల హక్కులను చాటిచెప్పడం, వారిపై వివక్షను తొలగించడం, సాధికారతను పెంపొందించడం, సమాజ నిర్మాణంలో వారి పాత్రను గౌరవించడంపై అవగాహన కల్పిస్తోందని అన్నారు. నేటి మహిళలు ఈ అవకాశాలను సద్వినియోగపరచుకొని ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ కె శివరామకృష్ణ, ప్రెసిడెంట్, షేర్ మెడికల్ కేర్ ఫౌండేషన్ వారు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో ప్రవేశిస్తున్నారని ముఖ్యంగా వైద్య సంబంధిత రంగాలలో నానాటికీ వీరి పాత్ర ఎక్కువగా ఉంటోందన్నారు. ఎంతో కష్టపడి వైద్య సంబంధిత రంగాలలో ప్రవేశిస్తున్న మహిళలు తమను తాము నిరూపించుకొంటూ రాణించాలని పేర్కొన్నారు. రోగుల పట్ల కరుణ, అప్యాయతలు చూపించగలిగే సహజగుణం మహిళలలో సహజసిద్ధంగా ఉంటుందని, వైద్యం కోసం వచ్చే వారి మనోబలాన్ని పెంచేలా పని చేయాలని సూచించారు.చివరగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డా. జయంతి రెడ్డి మాట్లాడుతూ కొన్ని దశాబ్దాల క్రితంతో పోలిస్తే నేటి మహిళలకు అన్ని రంగాలలో అవకాశాలు మెండుగా లభిస్తున్నాయన్నారు. పురుషులతో సమానంగా పోటీ పడుతున్న నేటి మహిళలు ధీటుగా పని చేస్తూ మంచి పేరు సంపాదిస్తున్నారని పేర్కొన్నారు. తల్లిగా, ఉద్యోగినిగా, వైద్యురాలిగా అన్ని భాధ్యతలను నిర్వహిస్తున్న మహిళ కృషి నేడు ప్రపంచ వ్యాప్తంగా గుర్తిస్తున్నారని దానిని మరింత పెంచేలా కృషి చేయాల్సిన భాధ్యత మహిళలపై మరింతగా పెరిగిందన్నారు.అనంతరం కార్యక్రమంలో భాగంగా మెడిసిటి ఇన్సిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కు చెందిన మహిళా వైద్యులు, సిబ్బంది, విద్యార్థినులు కలసి పలు సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. ముఖ్యంగా వైద్య రంగంలోని పరిస్థితులపై వీరు ప్రదర్శించిన నాటికలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాలలో డా. పియస్ రెడ్డి, వ్యవస్థాపకులు, షేర్ ఇండియా ఫౌండేషన్ ప్రొఫెసర్ కె శివరామకృష్ణ, ప్రెసిడెంట్, షేర్ మెడికల్ కేర్ ఫౌండేషన్ డా. దేవేంద్ర సింగ్ నేగి, ప్రిన్సిపాల్, MIMS డా. శైలేంద్ర, వైస్ ప్రిన్సిపాల్, MIMS డా. సి గీత, మెడికల్ డైరెక్టర్, మెడిసిటి హాస్పిటల్స్, ఘన్ పూర్ డా. బి కల్పన, ప్రొఫెసర్ మరియు హెడ్, ఆబ్స్టెట్రిక్స్ & గైనకాలజి విభాగం, MIMS డా. కిరణ్మయి, హెడ్, మైక్రో బయాలజీ విభాగం, MIMS డా. దీపిక, అసిస్టెంట్ ప్రొఫెసర్, MIMS డా. కృతి, సీనియర్ రెసిడెంట్, ఆబ్స్టెట్రిక్స్ & గైనకాలజి విభాగం, MIMS డా. మృణాళిక, పిజి విద్యార్థిని, ఆబ్స్టెట్రిక్స్ & గైనకాలజి విభాగం, MIMS లతో పాటూ పలువురు పిజి, యంబిబియస్, నర్సింగ్ విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావును కలిసిన కెవైసిఎస్ రాష్ట్ర కమిటీ

ఎల్బీనగర్, మార్చి 11 (నగర నిజం): తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచంద్రరావును కురుమ యువ చైతన్య సమితి (కెవైసిఎస్) రాష్ట్ర కమిటీ నాయకులు కలిశారు.“కెవైసిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కుండె వెంకటేష్ కురుమ“ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో కురుమల సమస్యలు, అలాగే బీజేపీ పార్టీలో కురుమలకు అవకాశాలు కల్పించే అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా నాయకులు కురుమ సమాజం ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను రాంచందర్ రావు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందిస్తూ భవిష్యత్తులో కురుమ కులాన్ని ప్రత్యేకంగా గుర్తించి, వారి సమస్యలను ప్రతిపక్షంలో నుంచే అధికార పక్షానికి తెలియజేసి పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌడ రాజ్ కుమార్ కురుమ, ఉపాధ్యక్షులు కొల్లు రమేష్ కురుమ, కోశాధికారి రావుల ఐలయ్య కురుమ, ప్రచార కార్యదర్శి కోడూరు అశోక్ కురుమ, రాష్ట్ర కార్యదర్శి కాల్నే మల్లేశం కురుమ (ఎల్బీనగర్ అధ్యక్షుడు), బాలం శ్రీనివాస్ కురుమ (వర్కింగ్ ప్రెసిడెంట్), మందుల విద్యాసాగర్ కురుమ (ఎల్బీనగర్ ప్రధాన కార్యదర్శి), బండారి శ్రీశైలం కురుమ, కడగంచి మల్లేశం కురుమ, ఎం. నరేష్ కురుమ, మాలిగ శ్రీశైలం కురుమ, కడగంచి శంకర్ కురుమ తదితరులు పాల్గొన్నారు.

ప్రభాత్ నగర్ కమ్యూనిటీ హాల్‌లో పోలీస్ స్టేషన్‌కు కాలనీవాసుల వ్యతిరేకత

- సంఘీభావం తెలిపిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

ఎల్‌బీనగర్, మార్చి 11 (నగర నిజం): చైతన్యపురి డివిజన్ పరిధిలోని ప్రభాత్ నగర్ కాలనీలో ఉన్న మాధవరెడ్డి కమ్యూనిటీ హాల్‌ను పోలీస్ స్టేషన్‌గా ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనకు కాలనీవాసులు ముక్తకంఠంతో వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కాలనీవాసుల వినతిమేరకు ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అక్కడికి చేరుకొని వారికి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ గతంలో టీమ్స్ హాస్పిటల్ ప్రాంగణంలో పోలీస్ స్టేషన్, విద్యుత్ సబ్‌స్టేషన్ మరియు పార్క్ స్థలం కోసం అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కోరగా, ఆయన వెంటనే సానుకూలంగా స్పందించి మంజూరు చేశారని గుర్తు చేశారు. అయితే ప్రస్తుతం ఆ స్థలం ఇవ్వలేమని అధికారులు తెలియజేసిన నేపథ్యంలో

ప్రభాత్ నగర్ కమ్యూనిటీ హాల్‌ను పోలీస్ స్టేషన్ కోసం ఉపయోగించాలనే ప్రతిపాదనపై స్థానికులు వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కాలనీవాసుల అభిప్రాయాన్ని గౌరవిస్తూ రెండు మూడు రోజుల్లో రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను కలిసి ఈ ప్రయత్నాన్ని విరమించుకోవాలని కోరుతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చైతన్యపురి డివిజన్ మాజీ కార్పొరేటర్లు నరసింహ గుప్త, విట్టల్ రెడ్డి, నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, సురేందర్ రెడ్డి, ప్రభాత్ నగర్ కాలనీ అధ్యక్షుడు బాల్ రెడ్డి, గట్టు శ్రీను, రమణారెడ్డి, రామారావు, రాజేష్, నాగేందర్, బాలరాజు, విద్యాసాగర్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

భూదాన్ భూములను పేదలకు పంచాలి

- తెలంగాణ జన సమితి నేత గోపగాని శంకర్రావు



ఖమ్మం:(నగర నిజం బ్యూరో) మార్చి 11: ఖమ్మం : పేద ప్రజలకు నివాస హక్కు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని, భూదాన్ భూములను నిజంగా అర్హులైన పేదలకు కేటాయించాలని తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్రావు డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లాలోని వెలుగు మట్ల ప్రాంతంలో భూదాన్ భూములపై పేదలు నిర్మించుకున్న ఇళ్లను కూల్చివేయడం అన్యాయమని ఆయన తీవ్రంగా విమర్శించారు.నేలకొండపల్లి భక్త రామ దాసు ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, భూదాన్ భూములుగా ఉన్న 62 ఎకరాల భూమి ప్రభుత్వానికి నేరుగా సంబంధం లేదని చట్టాలు, కోర్టులు పేర్కొన్నప్పటికీ పేదల ఇళ్లను కూల్చడం అర్థం కాని చర్యగా ఉందని అన్నారు. పేద ప్రజలు ఎన్నో కష్టాలు పడుతూ తమకు ఉన్న స్వల్ప వనరులతో ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్న సమయంలో వాటిని కూల్చివేయడం మానవత్వానికి విరుద్ధమని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రతి పేద కుటుంబానికి కనీసం 100 గజాల స్థలం ఇవ్వాలని ముఖ్యమంత్రి మరియు జిల్లా కలెక్టర్లకు ఇప్పటికే వినతిపత్రం అందజేశామని తెలిపారు. ప్రస్తుతం 70 గజాల భూమి ఇవ్వడం సరిపోదని, ఆ స్థలంలో కుటుంబానికి అవసరమైన విధంగా ఇల్లు నిర్మించుకోవడం చాలా కష్టమని ఆయన పేర్కొన్నారు.ఇప్పటికైనా వెలుగు మట్లలో ఉన్న 62 ఎకరాల భూదాన్ భూమిని పేద ప్రజలకు కేటాయించాలని, ఈ విషయంలో ప్రభుత్వ జోక్యం లేకుండా సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉందని శంకర్రావు అన్నారు. హైదరాబాద్‌లో అమలవుతున్న హైడ్రా విధానం మాదిరిగానే ఖమ్మం జిల్లాలో కూడా పారదర్శకంగా వ్యవస్థ ఉండాలని పేద ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు.అదేవిధంగా కొన్ని రాజకీయ నాయకులపై అక్రమ కేసులు నమోదు చేయ డానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ, వాస్తవ పరిస్థితులను తెలుసుకోవడానికి సమగ్ర సర్వే నిర్వహించి జిల్లాలో ఉన్న మిగులు భూములను గుర్తించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. అలా చేస్తే నిజంగా భూమిలేని పేదల కు న్యాయం జరుగుతుందని అభిప్రాయపడ్డారు.ఈ సమావే శంలో తెలంగాణ జన సమితి జిల్లా నాయకులు మాదాస్ శ్రీను, మండల నాయకులు మందడి వెంకటేశ్వరరావు, వడ్లమూడి వెంకట్ రాములు, నామరపు అచ్చయ్య, బస్వరపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు లిమ్స్ న్యూరో కార్డియాలజీ ఆసుపత్రి ప్రారంభోత్సవం

- ఆసుపత్రిని ప్రారంభించనున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు
- డాక్టర్ రామరాజ్ సారధ్యంలో శంషాబాద్ వద్ద తొలిసారిగా న్యూరో మరియు కార్డియాలజీ ఆసుపత్రి

రాజేంద్రనగర్, మార్చి 11 (నగరనిజం ప్రతినిధి): గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ శంషాబాద్ సర్కిల్ పరిధిలోని తొండుపల్లి ఔటర్ రింగ్ రోడ్డు జంక్షన్ వద్ద డాక్టర్ రామరాజు సారధ్యంలో నెలకొల్పిన లిమ్స్ న్యూరాలజీ కార్డియాలజీ ఆసుపత్రిని నేడు రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రారంభించనున్నారు. మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి ఈ ఆస్పత్రిని ప్రారంభించనున్నట్లు లిమ్స్ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ రామరాజ్ బుధవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. శంషాబాద్ పరిధిలో ఇప్పటికే మల్టీ స్పెషాలిటీ, మెటర్నిటీ ఆసుపత్రులను ప్రారంభించి ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ రామరాజు సారథంలోని వైద్యుల బృందం.... షాద్నగర్ తో పాటు ఇబ్రహీంపట్నం, కందుకూరు ప్రాంతాల్లో సైతం లిమ్స్ హాస్పిటల్స్ బ్రాంచీలను నెలకొల్పారు. అయితే శంషాబాద్ లో ఇప్పటివరకు న్యూరాలజీ,కార్డియాలజీ, ఆసుపత్రి అందుబాటులో లేకపోవడంతో శంషాబాద్ తో పాటు షాద్నగర్ జడ్చర్ల, మహేశ్వరం, కందుకూరు, చేవెళ్ల, మొయినాబాద్ తదితర ప్రాంతాలకు చెందిన ప్రజలు గుండె జబ్బులకు గురైన రోగులను హైదరాబాద్ కు తరలించే పరిస్థితి ఉండేది. దీంతో గుండెపోటుకు గురైన రోగులను హైదరాబాదులోని ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించే లోపు చాలామంది ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు లేకపోలేదు. ఈ నేపథ్యంలో శంషాబాద్ లో తొలిసారిగా డాక్టర్ రామరాజు సారథ్యంలోని వైద్యుల బృందం తొండుపల్లి ఔటర్ రింగ్ రోడ్డు జంక్షన్ వద్ద లిమ్స్ హాస్పిటల్ న్యూరాలజీ, కార్డియాలజీ ఆసుపత్రిని నెలకొల్పారు. ఈ మేరకు ఇప్పటికే ఈ ఆస్పత్రికి గత 8వ తేదీన స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, షాద్నగర్ ఎమ్మెల్యే ఈర్లపల్లి శంకర్ చేతుల మీదుగా సాఫ్ట్ లాంచ్ నిర్వహించారు. అనంతరం గడిచిన 10 రోజులుగా రోగులకు ఉచితంగా ఓపి సేవలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో గురువారం నాడు ఈ ఆస్పత్రి పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానుంది. ఈ మేరకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు చేతుల మీదుగా లిమ్స్ హాస్పిటల్స్ న్యూరాలజీ, కార్డియాలజీ ఆసుపత్రిని ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబుతో పాటు చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి,స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, షాద్నగర్ ఎమ్మెల్యే ఈర్లపల్లి శంకర్, మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే పర్ణికా రెడ్డి తదితర రాజకీయ ప్రముఖులు హాజరవుతారని డాక్టర్ రామరాజ్ ప్రకటించారు. గురువారం ఉదయం 11 గంటలకు భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు చేతుల మీదుగా ఆసుపత్రి ప్రారంభోత్సవం జరుగుతుందని డాక్టర్ రామరాజు వెల్లడించారు. లిమ్స్ న్యూరాలజీ, కార్డియాలజీ ఆసుపత్రి అందుబాటులోకి వస్తే శంషాబాద్ తో పాటు మహేశ్వరం, షాద్నగర్, పరిగి, చేవెళ్ల నియోజకవర్గం ప్రజలకు ఎంతగానో సౌకర్యవంతంగా ఉంటుందని ఆయన వెల్లడించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో గుండె జబ్బులకు సంబంధించి అనుభవజ్ఞులైన ప్రముఖ వైద్య నిపుణులచే రోగులకు వైద్య సేవలు అందించడం జరుగుతుందని డాక్టర్ రామరాజ్ స్పష్టం చేశారు.

జవహర్ నగర్ సమస్యలపై బహిరంగ సభకు కరపత్రం ఆవిష్కరణ

నగర నిజం న్యూస్ , జవహర్ నగర్, తేదీ: 11 మార్చి: జవహర్ నగర్ ప్రాంతంలోని వివిధ ప్రజా సమస్యలను ప్రభుత్వానికి తెలియజేయాలనే ఉద్దేశంతో క్రాంతి కళాబృందం ఆధ్వర్యంలో ఈ నెల 22న సాయంత్రం 5 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు నిర్వహించనున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు జవహర్ నగర్ గ్రామపంచాయతీగా ప్రారంభమై తర్వాత మున్సిపల్ గా, అనంతరం జిహెచ్ఎంసి పరిధిలోకి వచ్చినప్పటికీ ఇప్పటికీ మౌలిక వసతుల కల్పనలో వెనుకబడి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. జవహర్ నగర్ ఏర్పడి దశాబ్దాలు గడిచినా ఇప్పటికీ చాలామంది నోటరీ పత్రాల ఆధారంగానే ఇళ్లు నిర్మించుకోవాల్సి వస్తోందని, అధికారిక పర్మిషన్ లేకపోవడం వల్ల బ్యాంక్ లోన్ వంటి సౌకర్యాలు అందడం లేదని తెలిపారు. మరోవైపు యువతలో గంజాయి, మత్తు పదార్థాల వినియోగం పెరుగుతూ కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సుమారు మూడు లక్షల జనాభా ఉన్న జవహర్ నగర్ లో దాదాపు 90 కాలనీలు ఉండగా ప్రతి కాలనీలో ఒకటి రెండు బెల్ట్ షాపులు నడుస్తుండటంతో వందల సంఖ్యలో మద్యం విక్రయ కేంద్రాలు పనిచేస్తున్నాయని తెలిపారు. దీనివల్ల 24 గంటలు మద్యం అందుబాటులో ఉండి ప్రజల్లో మద్యపానం పెరుగుతోందని పేర్కొన్నారు. రామ్కీ డంపింగ్ యార్డ్ నుండి వచ్చే దుర్వాసన, కాలుష్యం కారణంగా ప్రజలు అనేక రోగాలతో బాధపడుతున్నారని, భూగర్భ జలాలు, సమీప చెరువులు కూడా కాలుష్యానికి గురవుతున్నాయని చెప్పారు. అలాగే చాలా కాలనీల్లో చెత్తకుండీలు లేకపోవడంతో ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయాల్సి వస్తోందని, గల్లీలలో చెత్త పేరుకుపోయి దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తడి చెత్త, పొడి చెత్త వేరు చేసే ప్రక్రియ కూడా ఇంకా సరిగా ప్రారంభం కాలేదని పేర్కొన్నారు. ఈ సమస్యలన్నింటిపై ప్రజలతో చర్చించి ప్రభుత్వానికి తెలియజేయడానికి నిర్వహించే బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్, క్రాంతి కళాబృందం వ్యవస్థాపకులు వి వెంకటాచారి, ఎస్కే మీరా మస్తాన్ బి, షేక్షావలి, జంగిలి శ్రీనివాస్, పాక దేవేందర్, శనిగరం నరసింహులు, నిమ్మల నరసింహ, సురేష్, కోడూరి శ్రవణ్, ఆంజనేయులు, మాధవి తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం

- 14 కేంద్రాల్లో 3,196 మంది విద్యార్థులు

సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు

నగర నిజం పటాన్‌చెరు, మార్చి 11: పటాన్‌చెరు మండలంలో ఈ నెల 14 నుండి ప్రారంభం కానున్న పదో తరగతి వార్షిక పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. మండల వ్యాప్తంగా మొత్తం 14 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మండల విద్యాధికారి నాగేశ్వరరావు రాథోడ్ తెలిపారు.పరీక్షల నిర్వహణకు సంబంధించిన సెట్1, సెట్2 ప్రశ్నపత్రాలను పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచినట్లు పేర్కొన్నారు. ఈ పరీక్షలకు మొత్తం 3,196 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరిలో బాలురు 1,746 మంది, బాలికలు 1,450 మంది ఉన్నారు.మండలంలో ప్రభుత్వ పాఠశాలలు 10, రెసిడెన్షియల్ పాఠశాలలు 6, ప్రైవేట్ పాఠశాలలు 32 ఉన్నాయి. వీరితో పాటు తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు కూడా పరీక్షలకు హాజరుకానున్నారు.పరీక్షలు ప్రతి రోజు ఉదయం 9:30 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు నిర్వహించబడతాయని తెలిపారు. అన్ని పరీక్షా కేంద్రాలను సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిర్వహించనున్నట్లు చెప్పారు.విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులతో పాటు విధుల్లో ఉండే అధికారులు కూడా సెల్‌ఫోన్లు తీసుకురావడానికి అనుమతి లేదని స్పష్టం చేశారు.మార్చి 14 నుండి ఏప్రిల్ 15 వరకు జరిగే ఈ పరీక్షలను విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో రాసేలా అన్ని చర్యలు తీసుకున్నామని విద్యాశాఖ అధికారులు వెల్లడించారు.

పటాన్‌చెరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా శివానందం



నగర నిజం మార్చి 11సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన నందిగామ గ్రామ మాజీ సర్పంచ్ శివానందం జిల్లా మంత్రి దామోదర్ రాజనర్సింహను మర్యాదపూర్వకంగా కలిశారు.నూతనంగా మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పటాన్‌చెరు నియోజకవర్గ ఇంచార్జి కాటా శ్రీనివాస్ గౌడ్‌తో కలిసి మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.అలాగే తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కూడా కలిసి, తనపై నమ్మకం ఉంచి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నందిగామ సర్పంచ్ విక్రమ్ గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మాదాసు రాజశేఖర్‌తో పాటు మార్కెట్ కమిటీ సభ్యులు పాల్గొని మంత్రులను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఘనంగా ఎల్లమ్మ తల్లి కల్యాణ మహోత్సవం.

మొయినాబాద్, మార్చి 11(నగర నిజం): మొయినాబాద్ మండలంలోని అమ్డాపూర్ గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ ఎల్లమ్మ తల్లి దేవాలయంలో భక్తి శ్రద్ధల మధ్య వేముల శ్రీనివాసులు స్వర్ణలత ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవాన్ని గ్రామానికి చెందిన గౌడ సంగం ఆధ్వర్యంలో భక్తి భావంతో నిర్వహించారు. దేవాలయం ప్రాంగణం మొత్తం భక్తులతో కళకళలాడుతూ ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించి అనంతరం ఎల్లమ్మ తల్లి కళ్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. పూజా కార్యక్రమాలలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించి ఆశీర్వాదాలు పొందారు. గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో పాల్గొనడంతో దేవాలయం పరిసరాలు జాతర వాతావరణాన్ని తలపించాయి. ఈ మహోత్సవానికి గ్రామ సర్పంచ్ మద్యపాగ కృష్ణ మరియు ఉప్ప సర్పంచ్ జితేందర్ రెడ్డి,వార్డు సభ్యులు శ్రీను, యాదయ్య, గ్రామ యువనాయకుడు మన్నె ప్రభాకర్ రెడ్డి ముక్య అతిథిగా పాల్గొన్నారు. మహోత్సవంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసి ప్రసాదం పంపిణీ చేశారు. మొత్తం కార్యక్రమం భక్తి, ఆధ్యాత్మికతతో నిండుగా కొనసాగింది.ఈ మహోత్సవం ఒగ్గు కలకరులతో కలిసి ప్రభాకర్ గౌడ్ ముందు ఉండి నిర్వహించారు. శాపురం కృష్ణ గౌడ్, కట్కూరి వెంకటేష్, కట్కూరి చిరంజీవి, కరోబార్ గోపాల్ చారి, కట్కూరి శేఖర్, సత్యలింగం గౌడ్, ఇంద్రపతి గౌడ్, మురళీ కృష్ణ గౌడ్, విజయ్ గౌడ్, హరికిరణ్, కొత్తపల్లి కృష్ణ, మద్యపాగ శ్రీను, అంజయ్య మరియు గ్రామప్రజలు పాల్గొన్నారు.

డిసెంబర్ 9న ముఖ్యమంత్రి చేతుల మీదుగా గృహ ప్రవేశాలు జరుపుకోవాలి

- డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి, తుమ్మల
- దళారులకు చెక్ పెడుతూ అర్హులకు అండగా నిలిచిన ప్రభుత్వం
- వెలుగుమట్ల భూ నిర్వాసితుల్లో అర్హులకు ఇళ్ల పట్టాలు, ఇందిరమ్మ ఇండ్లు
- 311 మందికి భూదాన్ భూమిలో భూమి పట్టాతో పాటు ఇందిరమ్మ ఇండ్లు
- 101 మంది అర్హులకు వారి సొంతూర్లలో ఇందిరమ్మ ఇండ్లు
- యుద్ధ ప్రాతిపదికన మౌళిక వసతుల కల్పన పనులు
- దళారుల నుంచి బాధితులకు డబ్బు వసూలు చేసి అందిస్తాం
- వెలుగుమట్ల భూ నిర్వాసితుల్లో అర్హులకు పట్టాలు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేసిన డిప్యూటీ సీఎం, మంత్రుల

ఖమ్మం:(నగర నిజం బ్యూరో) మార్చి -11: డిసెంబర్ 9 న సోనియాగాంధీ పుట్టిన రోజు సందర్భంగా వెలుగుమట్ల భూదాన్ భూముల లబ్ధిదారులు సామూహిక గృహప్రవేశం జరుపుకోవాలని, ఆ దిశగా ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన అవసరమైన చర్యలు చేపడుతుందని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులు తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వరరావులు వెలుగుమట్ల భూ నిర్వాసితుల్లో అర్హులకు పట్టాలు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు.డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత ఇండ్లు ఉండాలని నిర్ణయం తీసుకుని తమ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. హౌసింగ్ శాఖ ద్వారా 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇండ్లను 22 వేల 500 కోట్లతో మంజూరు చేశామన్నారు. ప్రతి వారం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం బిల్లులు విడుదల చేస్తుందని తెలిపారు. పేదలకు న్యాయం జరగాలనే ఉద్దేశ్యంతో పనిచేస్తున్న ప్రభుత్వంపై కొంత మంది కావాలని బురద చల్లుతున్నారని తెలిపారు. పేదల నిస్సహాయత ఆసరాగా తీసుకొని సమాంతరమైన వ్యవస్థ ఏర్పాటు చేసి త్రాగునీరు, బడి, విద్యుత్ సదుపాయం వంటి సౌకర్యాలు లేకుండా పేదలు భయం లోనే బ్రతికేలా విష వలయం పన్నారని డిప్యూటీ సీఎం అన్నారు. పేదలు ఆత్మగౌరవంతో జీవించాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వం నేడు పట్టాలు అందిస్తుందని అన్నారు. పేదల కోసం పనిచేస్తున్న ప్రభుత్వంపై కొంతమంది కావాలని దురుద్దేశంతో సామాజిక మాధ్యమాలలో విష ప్రచారం చేస్తున్నారని, ఎవరు ఏం ప్రచారం చేసిన పేదలకు న్యాయం జరగాలనీ అంతిమ లక్ష్యాన్ని సాధించే దిశగా తాము పని చేస్తున్నట్లు తెలిపారు.రాజకీయ దురుద్దేశాలు, ప్రభుత్వాన్ని విమర్శించారు అనే పట్టింపులు లేకుండా అర్హులైన 412 మంది నిరుపేద కుటుంబా లకు ఒకేసారి ఇందిరమ్మ ఇండ్లను నేడు మంజూరు చేస్తున్నామని తెలిపారు. పేదలను అనేకమంది అనేకసార్లు వచ్చి బెదిరించే వారని, భయాందోళనల మధ్య గతంలో వారు గడిపారని, ఆ పరిస్థితికి నేడు ప్రజా ప్రభుత్వం స్వస్తి పలికిందని తెలిపారు.ప్రభుత్వం అందించిన పట్టాలలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం భూమి పూజ కార్యక్రమం గురువారం జరుపుకోవాలని ఆయన సూచించారు. డిసెంబర్ 9 న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, ఇతర మౌళిక వసతులు పూర్తి చేసి ముఖ్యమంత్రి చేతుల మీదుగా గృహ ప్రవేశ కార్యక్రమం నిర్వహించుకోవాలన్నారు. పేదల పట్ల తమ ప్రభుత్వానికి ఉన్న కమిట్మెంట్ ను పది సంవత్సరాల పాటు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరిట మోసం చేసిన ప్రతిపక్షాలు ప్రశ్నించడం హాస్యాస్పదమని, ప్రభుత్వాన్ని ప్రశ్నించే అర్హత తమకు ఉందా అని ఆత్మవిమర్శ చేసుకోవాలని డిప్యూటీ సీఎం హితవు పలికారు. పేదల నిస్సహాయతను ఆసరాగా చేసుకుని డబ్బులు వసూలు చేసిన ప్రతి ఒక్కరికి కఠిన శిక్ష పడేలా చూస్తామని, ప్రతి ఒక్క రూపాయి నిందితుల నుంచి వసూలు చేసి బాధితులకు పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రపంచ స్థాయి పోటీలకు సన్నద్ధమయ్యే విధంగా మన విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకులాలను నిర్మిస్తుందని తెలిపారు. వెలుగు మట్ల భూదాన్ భూములలో పేదలకు పంచగా మిగిలిన భూమిలో తెలంగాణ పబ్లిక్ స్కూల్, స్కూల్స్ పక్క భవనాలకు ఆ స్థలం ఉపయోగిస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు. వెలుగుమట్ల లబ్ధిదారులు నేటి నుంచి నిర్భయంగా ఉండాలని, మోడల్ కాలనీగా తయారు చేసి అందించే బాధ్యత తాము తీసుకుంటామని తెలిపారు.రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ. మార్చి 1, 2026 నాడు ఇచ్చిన మాట ప్రకారం నిరుపేదలైన లబ్ధిదారులకు సీఎం, కేబినెట్ సహచరుల సహకారంతో 311 మంది ఇంటి స్థలం లేని వారికి ఇండ్ల పట్టాలు, ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రం, సొంత ఊరిలో స్థలం ఉన్న మరో 101 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లను ఎటువంటి భేషజాలు లేకుండా ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు.ఫిబ్రవరి 24న వెలుగుమట్ల ఇండ్ల కూల్చివేతలు జరిగిన తర్వాత ప్రధాన ప్రతిపక్ష నాయకులు వచ్చి మొసలి కన్నీరు కార్చారని మంత్రి ఎద్దేవా చేశారు. 2023 జూలై నెలలో ఎన్నికల కంటే ముందు వెలుగు మట్ల ప్రాంతంలో కూల్చివేతలకు గత ప్రభుత్వం పాల్పడింది వాస్తవం కాదా, 9 సంవత్సరాలుగా పేదలు ఎటువంటి వసతులు లేకుండా నివసిస్తుంటే చూస్తూ ఊరుకున్నారు తప్ప ఎటువంటి పట్టాలు పంపిణీ చేయలేదని తెలిపారు.పది సంవత్సరాలు రాష్ట్రాన్ని పరిపాలించే సమయంలో పేదలకు పట్టాలు ఇవ్వాలనే బుద్ధి జ్ఞానం ఎందుకు రాలేదని మంత్రి విమర్శించారు. గత పాలకులకు విశాల హృదయం లేదని, తమ ప్రభుత్వం ప్రజల కష్టాలను చూసి చలించి నేడు పట్టాలు పంపిణీ చేస్తున్నామని అన్నారు. ప్రజా ప్రభుత్వం గురించి మాట్లాడే నైతిక హక్కు ప్రతిపక్షానికి లేదని స్పష్టం చేశారు. ప్రతిపక్ష నాయకులు మా ప్రభుత్వం వస్తుందని పగటి కలలు కంటున్నారని, అనేక ఎన్నికల ఫలితాలు వస్తున్నప్పటికీ మార్పు చెందకుండా కక్ష పూరిత మనస్తత్వం తో ప్రవర్తిస్తున్నారని అన్నారు. 10 సంవత్సరాల పాటు పేదలను పట్టించు కోలేదని, ప్రస్తుత ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు పేదలకు ఇస్తుందని అన్నారు.త్రాగునీరు, రోడ్లు, ఫంక్షన్ హాల్, షాపింగ్ కాంప్లెక్స్, స్కూల్, విద్యుత్ సరఫరా వంటి అనేక మౌళిక వసతుల వసతుల పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని అన్నారు. గత 8 సంవత్సరాలుగా పేదలు ఇబ్బందులు పడిన మాట వాస్తవమేనని, ఆ సమస్యలకు నేడు పరిష్కారం లభిస్తుందని, అర్హులైన బాధితులు ఎవరైనా ఇంకా మిగిలి ఉంటె వారికి కూడా తమ ప్రభుత్వం తప్పని సరిగా ఇండ్లు మంజూరు చేస్తుందని అన్నారు. పేదలను మోసం చేసి దళారులు వసూలు చేసిన డబ్బు ఒక్క రూపాయి కూడా వదలకుండా పూర్తి స్థాయిలో వసూలు చేసి బాధితులకు అందించాలని మంత్రి పోలీస్ కమీషనర్ ను ఆదేశించారు. వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూలిపేదలను కొంత మంది ముఠాగా ఏర్పడి మోసం చేస్తే గత పాలకులు పట్టించుకోలేదన్నారు. తెలంగాణ భూదాన్ యజ్ఞ బోర్డు పేరిట ఇచ్చిన పత్రాలు బోగస్ అని, సిసిఎల్ఏ ఆ భూములు స్వాధీనం చేసుకోవాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. లాఠీ ఛార్జ్ లేకుండా అక్రమ నిర్మాణాలు కూల్చివేసి దగా కోరులను తరిమివేశామని మంత్రి తెలిపారు. నిరుపేదలకు వెలుగు మట్ల భూదాన్ భూములలో భూ పట్టాలు పంపిణీ చేస్తున్నామని, పిల్లల భవిష్యత్తు కోసం ఇక్కడ మోడల్ స్కూల్ నిర్మిస్తామని చెప్పారు. యుద్ధ ప్రాతిపదికన రహదారులు, విద్యుత్, మంచి నీరు, రోడ్లు, డ్రైయిన్ వంటి మౌళిక వసతుల కల్పన పనులు పూర్తి చేస్తామన్నారు.డిసెంబర్ 9న సోనియా గాంధీ జన్మదినం సందర్భంగా ముఖ్యమంత్రి గారిని తీసుకువచ్చి భూ దాన్ భూములలో నూతనంగా చేపట్టే 311 మంది లబ్ధిదారుల కాలనీ ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. నిరుపేదలకు న్యాయం చేయాలనే ఉద్దేశ్యంతో కొంత ఇబ్బంది పడటం జరిగిందని ఆయన తెలిపారు. అనధికారికంగా నిరుపేదలు నివసించే దుస్థితి రాకుండా అవసరమైన మౌళిక వసతులు కల్పిస్తామని అన్నారు. 311 మంది లబ్ధిదారులే కాకుండా మరో 101 మంది నిరుపేదలకు వారి సొంత ఊరిలో ఉన్న స్థలంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసామని అన్నారు. చివరి లబ్ధిదారుడి వరకు ఇండ్లు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, వెలుగుమట్ల కాలనీ అద్భుతంగా తీర్చి దిద్దుతామని, పేదల దగ్గర డబ్బులు వసూలు చేసిన దళారుల వివరాలు పోలీసులకు అందించాలని, వారికి కఠిన శిక్ష పడేలా చూస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ వెలుగు మట్ల భూదాన్ భూములకు సంబంధించి పెద్ద భూ మాఫియా నడుస్తుందని, ప్రజల దగ్గర నుంచి డబ్బులు వసూలు చేసిన వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. 311 మంది నిరుపేదలకు పట్టాలు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. నిరుపేదలు నివసించే కాలనీలో ఇండ్లతో పాటు పార్క్, రోడ్డు, స్కూలు, విద్యుత్తు, త్రాగు నీరు వంటి మౌళిక సదుపాయాల పనులు కూడా వేగవంతంగా పూర్తి అయ్యేలా చూడాలన్నారు. ప్రత్యేక కేసు క్రింద పరిగణించి ఇంటి నిర్మాణానికి మంజూరు చేసే నిధులు పెంచాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ వెలుగుమట్ల భూదాన్ భూముల నిర్వాసితుల బాధితులలో పారదర్శకంగా చేపట్టిన సర్వే ద్వారా అర్హులుగా గుర్తించిన 311 మంది లబ్ధిదారులకు నేడు డిప్యూటీ సీఎం, మంత్రుల చేతుల మీదుగా వెలుగు మట్లలో ఇంటి స్థలాలతో పాటు ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు పంపిణీ చేస్తున్నామన్నారు. వెలుగుమట్ల భూదాన్ భూములలో లేఔట్ వేసి 311 ఫ్లాట్ లు చేశామని, లబ్ధిదారులకు పారదర్శకంగా సాఫ్ట్ వేర్ తో మానవ ప్రమేయం లేకుండా ర్యాండమైజేషన్ ద్వారా ప్లాట్ లు కేటాయించామని తెలిపారు. 1953 రికార్డుల ప్రకారం 147, 148, 149 సర్వే నెంబర్ లో 31 ఎకరాల 7 గుంటల భూమినీ రాజా రామారావుభూదాన్ ఉద్యమంలో దానం చేశారని తెలిపారు. ఖమ్మం పోలీస్ కమీషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ2014లో కత్తి రామ చంద్రయ్య, ముత్తయ్య, కల్లూరి కృష్ణ, బాబురావు, ఇతరులు ఇలా 21 మంది సభ్యులు కలిసి ఒక సంఘం తయారు చేసి భూదాన్ భూములను కబ్జా చేసి పేదల దగ్గర నుంచి 30 వేల నుంచి మూడు లక్షల రూపాయల వరకు వసూలు చేసి భూమి పట్టాలు ఇస్తామని ఆక్రమణలు చేయించా రని, వీరిపై ఇప్పటివరకు 26 కేసులు నమోదు చేసి 11 మందిని అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. కల్లూరు కృష్ణ ఇంటిలో చేపట్టిన తనిఖీ లలో మూడు కోట్ల రూపాయల వరకు పేదల నుంచి వసూలు చేసినట్లు ఆధారాలు లభించాయని, వీరి ఆస్తులు వివరాలు సేకరించి వాటి ద్వారా పేదల నుంచి వసూలు చేసిన డబ్బు రికవరీ కు ప్రయత్నం చేస్తామని సిపి తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న వెలుగు మట్ల లబ్ధిదారులు మాట్లాడుతూ గత 8 సంవత్సరాలుగా భూదాన్ భూములలో ఉంటున్నప్పటికీ రోడ్లు, కరెంట్, త్రాగునీరు వంటి మౌళిక వసతులు లేక చాలా ఇబ్బందులు పడ్డామని, నేడు అన్ని వసతులతో కూడిన లేఔట్ లో తమకు ఇంటి స్థలాలు కేటాయించి ఇందిరమ్మ ఇండ్ల పథకానికి ఎంపిక చేయడం సంతోషంగా ఉందని, నిరుపేదలైన తమను అర్హులుగా ఎంపిక చేసి పట్టాలు పంపిణీ చేసినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.దళారులు కొంతమంది పార్టీ ఫండ్, విద్యుత్ పోల్స్, భూమి రెగ్యులరైజ్ కోసమని తమ దగ్గర నుంచి డబ్బులు వసూలు చేశారని, ప్రజలను మోసం చేస్తున్న వారికి శిక్ష పడే విధంగా చూడాలని మంత్రులను లబ్ధిదారులు కోరారు. ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, కార్పొరేషన్ చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యనారాయణ, ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ, ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, నగర డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, జిల్లా రెవెన్యూ అధికారిణి ఏ. పద్మశ్రీ, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

వరిసరాల పరిశుభ్రతోనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారు

- వెంకటాపూర్ సర్పంచ్ అర్చన అజయ్ రెడ్డి

మొయినాబాద్,మార్చి 11 (నగర నిజం): వరిసరాల పరిశుభ్రతోనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని వెంకటాపూర్ సర్పంచ అర్చనఅజయ్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పరిసరాల పరిశుభ్రతలో భాగంగా పాఠశాల ఆవరణలో గ్రామానికి మంచినీరు అందించే మినీట్యాంక్ను బ్లీచింగ్ పౌండర్తో శుభ్రం చేయించారు. అందులో ఉన్న మురికి నీటిని మోటర్ పంపు ద్వారా ఇంకుడు గుంతలోకి వదిలారు. పాఠశాలలోని ముళ్లపొదలు, చెత్తచెదారాలను తొలగించారు. ఆమె మాట్లాడుతూ ఎవరో వస్తారు ఏదో చేస్తారని దాని కంటే మన పనులను మనం నిర్వహించుకుంటే ఎంతో అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. వరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని సూచించారు. ముఖ్యంగా ప్రజలు త్రాగే మంచినీరు శుద్ధి చేసుకొని తాగాలని పేర్కొన్నారు. గ్రామంలో ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే పరిష్కరించేందుకు కృషి చేద్దామని గ్రామ పంచాయతీ పాలకవర్గం, ప్రజలందరూ సహకరించుకుందామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణారెడ్డి, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పెర్లపల్లి లక్ష్మీ బాయి 5వ వర్ధంతి సందర్భంగా నివాళులు

నగర నిజ న్యూస్ , జవహర్ నగర్, తేదీ: 11 మార్చి: పెర్లపల్లి లక్ష్మీ బాయి 5వ వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులు ప్రేమతో స్మరించుకున్నారు. తల్లి ప్రేమ, ఆశీస్సులు, త్యాగం, మార్గదర్శనం తమ జీవితాలకు ఎప్పటికీ ప్రేరణగా నిలిచాయని తెలిపారు. ఆమె లేని లోటు ఎప్పటికీ తీరనిదని, కానీ ఆమె జ్ఞాపకాలు తమకు ఎల్లప్పుడూ దారిచూపుతాయని పేర్కొన్నారు.పెర్లపల్లి లక్ష్మీ బాయి చూపిన మార్గంలోనే ముందుకు సాగుతూ ఆమె విలువలను కొనసాగిస్తామని కుటుంబ సభ్యులు చెప్పారు. ఆమె ప్రేమ తమ జీవితాలకు వెలుగునిచ్చిందని, ఆమె జ్ఞాపకాలు ఎల్లప్పుడూ హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని గుర్తు చేసుకున్నారు.ఈ సందర్భంగా కుమార్తె స్వరూప కృష్ణ కుటుంబ సభ్యులతో కలిసి లక్ష్మీ బాయి స్మృతికి ఘన నివాళులు అర్పించారు.

ఎంపీ వద్దిరాజు వెలుగుమట్ల బాధితులందరికి న్యాయం జరగాల్సిందే

ఖమ్మం :(నగర నిజం బ్యూరో) మార్చి 11: వెలుగుమట్ల బాధితులందరికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర స్పష్టం చేశారు.ఖమ్మం నగర శివార్లలోని 60 ఎకరాల భూదాన్ భూముల్లో 700 కుటుంబాలు గుడిసెలు వేసుకుని జీవిస్తుండగా, అందులో కేవలం 311 మందికి మాత్రమే పట్టాలివ్వడం అభ్యంతరకరమన్నారు.ప్రభుత్వం అనాలోచిత చర్యతో రోడ్డునపడ్డ బాధితులను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.రామారావు పరామర్శించి మనోధైర్యాన్నిచ్చి కొండంత అండగా నిలిచారని ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు.నిరాశ్రయులైన వారంతా కూడా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన వారేనని, ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో బీఆర్ఎస్ ఆధ్వర్యాన తాగునీరు,భోజన వసతి కల్పించడం జరిగిందని ఎంపీ రవిచంద్ర వివరించారు.బాధితులకు ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ అండగా నిలిచి పోరాడడంతో ప్రభుత్వం దిగివచ్చి పట్టాలిచ్చేందుకు ముందుకు వచ్చిందని ఆయన స్పష్టం చేశారు.కేవలం 311మందికి పట్టాలిచ్చి చేతులు దులుపుకుంటే సరిపోదని, నిరాశ్రయులైన 700 కుటుంబాలకు స్థలాలు ఇవ్వడమే కాక డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టించి ఇవ్వాలని ఎంపీ రవిచంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కూల్చివేతల సందర్భంగా పక్కా గృహాలు కోల్పోయిన వారికి తగువిధంగా నష్టపరిహారం చెల్లించాలని,వెలుగుమట్లలో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎంపీ వద్దిరాజు కోరారు.

Edited & printed and owner,publisher Yela purushotham,(Regd): H-No 11-21-890,Ntr Nagar,L.B nagar saroor nagar mandal,Rangareddy-Dist,500074, printed Y.p.s publication H-No 11-21-890,Ntr Nagar,L.B nagar, saroor nagar mandal,Rangareddy-Dist,TELANGANA-500074, Editor Yela purushotham.(H.O) : plot no:31,H-No 1-13,kuntloor road,Near hayathanagar,abdullapur mettu mandal,rangareddy dist,TELANGANA-501505,
RNI NO: APTEL/2013/54450.(PRGI) .PH NO:8247467562 Email; nagaranijam@gmail.com.Whatsapp no : 8247467562,WEBSITE: WWW.NAGARANIJAM.COM.TELANGANA STATE